క్లుప్తంగా

నేడు మంత్రి సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సాయంత్రం 3 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగే వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొని త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల మహిళా గ్రూపులకు చెక్కులు పంపిణీ చేస్తారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయిలో జరిగే గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొంటారని మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 27 తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వన్యప్రాణులకు పండ్లు, తాగునీరు సరఫరా

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట సమీప అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు ఎల్బీ బ్రాబ్ కాస్టింగ్ చైర్మన్ చీమలదిన్నె శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పండ్లు, తాగునీరు అందజేశారు. శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ వేసవి కాలంలో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు దాహానికి, ఆకలికి ఇబ్బందులు పడకుండా నీటి తొట్లలో నీరు, అరటి పండ్లు ఉంచామని చెప్పారు. విలేజ్ ఫోర్స్ అధ్యక్షుడు శశికుమార్‌రెడ్డి, సభ్యులు రహీం, కృష్ణ కుమార్, నవీన్, లతీఫ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య శిబిరం



వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, మురారిని సన్మానిస్తున్న గోపాల్‌రెడ్డి

తర్లుపాడు: మార్కాపురంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో విర్కో ఫౌండేషన్ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏప్రిల్ 5న వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు డి. గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని దివ్యాంగులను కలిసి శిబిరానికి రావాలని కోరారు. ప్రమాదాల్లో కాళ్ళు, చేతులు కోల్పోయిన వారు, పోలియో వలన దివ్యాంగులైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కృత్రిమ పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డిని మండల పార్టీ అధ్యక్షులు మురారిని కలిసి వైద్య శిబిరం గురించి వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేసి గ్రామాల్లో ఉన్న దివ్యాంగులు అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కాపురం, తర్లుపాడు, మండలాల అధ్యక్షులు ఎల్. శేఖర్, బైరెడ్డి వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

సత్తాచాటిన సానికవరం టీమ్



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ట జెడ్పీ హెచ్ పాఠశాలలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం గ్రామస్తులు ప్రారంభించారు. సానికవరం టీమ్, మార్కాపురం మండలం బిరుదలనర్వ టీమ్ పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సానికవరం టీమ్ 12 ఓవర్లలో 92 పరుగులతో గెలిచింది. బిరుదలనర్వ టీమ్ 11.4 బంతుల్లో 89 పరుగులకు ఆలౌటైంది. అంపైర్లుగా జెడ్డా దానియేలు, జి. భరత్‌రెడ్డిలు వ్యవహరించారు. సర్పంచ్ గుంటు గాలెమ్మ, వైస్ సర్పంచ్ మద్దూరు దానియేలు, స్కూల్ చైర్మన్ మూల వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ మూల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ జెడ్డా లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మూల సత్యనారాయణరెడ్డి, ఏర్వ తిరుమలకొండారెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి చలో ఢిల్లీ

మార్కాపురం టౌన్: కార్మికులు, రైతులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు, స్కీం వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. గురువారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచింతరువాత కార్మికుల సమస్యల పట్ల మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను పెంచాలన్నారు. వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచాలని, పట్టణాల్లో కూడా అమలు చేయాలని కోరారు. సోమయ్య, సుబ్బారాయుడు, రూబెన్, బాలశేషయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.



గుండ్లాపల్లి కోదండరామస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు పరాంకుశం రంగనాథ దీక్షితులు



లాయరుపేట సాయిబాబా ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

చీమకుర్తి: శ్రీరామనవమి వేడుకలను చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో భాగంగా శ్రీ సీతారామ స్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వేద పండితుల సమక్షంలో జరిపించారు. చీమకుర్తి పల్లపోతువారివీధిలో శ్రీసీతారామస్వామి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేదపండితుడు పరాంకుశం సాయికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని తిలకించారు. సంతనూతలపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో స్థానిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీసీతారామస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, ఫలహారాన్ని అందించారు. గ్రామాల్లోని శ్రీసీతారామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

వైభవంగా రాములోరి కల్యాణం...

మద్దిపాడు: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో రామాలయాల్లో స్వామివారి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని పరవశించిపోయారు. స్వామివారి కల్యాణాన్ని భక్తులు వీక్షించడానికి అనువుగా కమిటీ సభ్యులు షామియానాలు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ భక్తులు లెక్కచేయకుండా స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి తండోపతండాలుగా వచ్చారు. గుండ్లాపల్లి కోదండరామస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని శ్రీనివాస రావు ఆధ్వర్యంలో అర్చకస్వామి పరాంకుశం రంగనాథ దీక్షితులు జరిపించారు. స్వామివారి కల్యాణం వీక్షించిన భక్తులకు కమిటీల ధర్మకర్తలు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా శ్రీరామనవమి

కొత్తపట్నం: శ్రీరామ నవమి పురస్కరించుకుని మండలంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో సీత, రాములవారికి కల్యాణమహోత్సవం నిర్వహించారు. పండితులు, పురోహితులు వేద మంత్రాల మధ్య కల్యాణ మహోత్సవం జరిగింది. అల్లూరు, ఆలూరు, మోటుమాల, పాదర్తి, కొత్తపట్నం, ఈతముక్కల గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో సీత, రాముల వారికి కల్యాణమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. మోటుమాల కోదండరామస్వామి ఆలయంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి సర్పంచ్ కోడూరి గోపి సతీమణి శ్రీలక్ష్మి హాజరై పూజలందుకున్నారు.

ఒంగోలు రూరల్: కరవదిలో వెంచేసి ఉన్న సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. 136వ బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా వేదపండితులు కేశావాచార్యులు, టీటీడీ వేదపండితులు ఎస్.వి.ఎస్.రఘుప్రదీప్ వేదమంత్రోచ్చరణ మధ్య కళ్యాణ మహోత్సవం ప్రారంభమైంది. ఉభయధాతలుగా మొక్కపాటి శర్మ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సీతారామ చంద్రస్వామి దేవస్థానం అర్చకులు కేశావాచార్యులు వేదమంత్రాలు జపిస్తుండగా కళ్యాణం నిర్వహించారు. కరవది గ్రామం పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు తమ కన్నులారా సీతారామ కళ్యాణాన్ని వీక్షించారు. భక్తులకు స్థానిక అయ్యప్ప సేవా మండలి వారు పులిహోర పొట్లాలను అందజేశారు. సాయంత్రం రథచక్రాలపై కొలువుతీరిన స్వామి వార్లను వేదపండితులు కేశావాచార్యులు, బాబు శర్మ, రఘుప్రదీప్ ఒక్కో రథంపై ఊరేగించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని హారతులు ఇచ్చారు. సాయంత్రం జరిగిన తిరునాళ్ళలో భారీ సంఖ్యలో పరిసర గ్రామాల నుంచి ఒంగోలు నుంచి ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈవో వెలగం శ్రీనివాస్ నిర్వహించగా కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ డ్బా.ఆర్.వి.ఎస్.మల్లిఖార్జునరావు, శివాలయ ఆలయ చైర్మన్ శిరిగిరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఒంగోలు టౌన్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గురువారం సాయిబాబా మందిరంలో శ్రీసీతారామ కల్యాణం అంగరంగ వైభోగంగా జరిగింది. మంత్రి శిద్దా రాఘవ రావు, లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కళ్యాణ వేడుకల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులను అందుకున్నారు. షిర్డీ నాథుని దర్శించుకున్న రాఘవరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా దేశాలయ ప్రాంగాణంలో ప్రత్యేకంగా అలంకరించిన సీతారామ కళ్యాణ వేదిక వద్ద నిర్వహించిన శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. వేదపండితులు నేలబోట్ల సదా శివయ్య పండితుల బృందం కళ్యాణ కృతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా శిద్దా దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, రజిత యజ్ఞోపవేతం, ప్రత్యేక ముత్యాల తలంబ్రాలు, పూలు, పండ్లు, లక్ష్మణ స్వామి, రామభక్త హనుమాన్ స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, శ్రీరామ జపం, భక్తుల సందడి నడుమ జగదాభిరాముని కళ్యాణం కన్నుల పండువగా జరిగింది.

కళ్యాణం ప్రధాన ఘట్టం మంగళసూత్రధారణ అత్యంత వైభవంగా జరిగింది.శిద్దా దంపతులు సీతా రాముల వారికి ముత్యాల తలంబ్రాలను సమర్పించడంతో వేదిక పరిసరాలు శ్రీరామనామ జపంతో మార్మోగింది. కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.దీంతో సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శిద్దా రాఘవరావు మాట్లాడుతూ.. సమస్త మానవాళి సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీరామచంద్రుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఉప్పర సంఘం ఆధ్వర్యంలో..

ప్రకాశంజిల్లా సగర (ఉప్పర) సంఘం ఆధ్వర్యంలో శ్రీ రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేశవస్వామి పేటలోని శ్రీభగీరథ మహర్షి మందిరంలో సంఘం అధ్యక్షులు జూటూరి శ్రీనివాసులు నేతృత్వంలో శ్రీసీతారాముల వారి కళ్యాణం రమణీయంగా జరిగింది. భక్తులు పెద్ద తరలి రావడంతో మందిరం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. జలశ్రీ మురళీ కృష్ణ,రెడిడ పరమేశ్వరరావు, దండూరి శ్రీనివాసులు, గండికోట ఏడుకొండలు, హర్ష వర్ధన్, లక్ష్మణ్,వెంకట కృష్ణారావు, మండల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు: పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



సంతనూతలపాడులో నిర్వహిస్తున్న ఆర్యవైశ్య కల్యాణ మండపం కమిటీ సభ్యులు



చీమకుర్తి ఆలయంలో పూజలు చేస్తున్న మారం వెంకారెడ్డి



మోటుమాలలో పూజలు



కరవది: కళ్యాణం నిర్వహిస్తున్న కేశవాచార్యులు



కరవది: కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



చీమకుర్తి శ్రీసీతారామస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



ఒంగోలు: ఉప్పర సంఘం ఆధ్వర్యంలో జరిగిన స్వామి వారి కల్యాణం

హరిహరక్షేత్రం వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

చీమకుర్తి: మండల కేంద్రం చీమకుర్తిలో తిరునాళ్ల, హరిహరక్షేత్రం వార్షికోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ ఆర్యవైశ్య సోదరులకు పిలుపునిచ్చారు. చీమకుర్తిలో ఆర్యవైశ్య సోదరులతో గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఏప్రిల్ 4వ తేదీ హరిహరక్షేత్రం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు, చీమకుర్తి తిరునాళ్లలో ఏర్పాటుచేసే విద్యుత్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నూనె హేమసుందర్, నూకత సుబ్రహ్మణ్యం, మద్ది వెంకట్రావు, ఆలపాటి శ్రీనివాసరావు, స్థానిక ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యులతో చర్చిస్తున్న ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్

మా నమ్మకం నువ్వే జగనన్న



ఎమ్మెల్యే కేపీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మార్కాపురం: నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు జగనన్న గృహసారథులు ఏప్రిల్ 1 నుంచి జరిగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో పార్టీ కౌన్సిలర్‌లతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి 5వరకు ప్రతి బ్లాక్‌లో కౌన్సిలర్లు, గృహసారథులు సమావేశాలు పెట్టాలని 7 నుంచి 14 వరకు ప్రతి గృహాన్ని సందర్శించాలన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని పార్టీలతో సంబంధం లేకుండా పథకాలను అమలు చేస్తున్న విషయాలను గృహసారథులు వివరించాలన్నారు. చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మెన్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, డాక్టర్ కనకదుర్గ, పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తిరవిచంద్ర, కౌన్సిలర్లు సిరాజ్, ఉత్తమ్ కుమార్, కరీం భాషా, కాళ్ళ ఆది, రహంతుల్లా, దొడ్డా భాగ్యలక్ష్మి, గుంటక చెన్నారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపన

మార్కాపురం మండలం రాయవరం గ్రామంలో జేజేయం పథకం కింద 49.49 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌యస్ఆర్‌కు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు కార్యాలయ ప్రతినిధి జనార్దన్‌రెడ్డి తెలిపారు. అనంతరం 11 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా తర్లుపాడు మండలంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మార్కాపురం టౌన్: వేసవిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలో గాంధీ పార్కు దగ్గర రెడ్డి సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారి కోసం చలివేంద్రాలు దప్పిక తీరుస్తాయన్నారు. సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డిని, సంఘ సభ్యులను అభినందించారు. పార్టీ కౌన్సిలర్ డాక్టర్ సి.హెచ్ కనకదుర్గ, దండా వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

జగ్జీవన్ రాం విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి స్థలం కేటాయించి విగ్రహం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులతో పాటు దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి గురువారం సాయంత్రం వినతి పత్రం ఇచ్చారు. డి. బాబి, ఉత్తమ్‌కుమార్, కాశీరావు, సుస్మిత భూషణకుమారి, సంజీవ్, ప్రభాకర్‌రావు, ముసలయ్య, ప్రేమ్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

పామూరు: కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు, ఉపాధిహామీ పథకంకు నిధుల కేటాయింపులో కోత విధింపును నిరసిస్తూ వచ్చే నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ అన్నారు. పామూరులో పంచాయతీ కార్మికులతోపాటు పలు విభాగాల కార్మికులతో రు సమావేశమై ఛలోఢిల్లీ విజయవంతంపై చర్చించి భారీఎత్తున ఢిల్లీకి తరలిరావాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి, షేక్.అల్లాబక్షు, పి.శ్రీను, మాలకొండయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

పీసీపల్లి: వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ చేతుల మీదుగా చేయనున్నట్లు ఎంపీపీ అత్యాల జపన్య తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

సర్పంచ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించం



సింగరాయకొండ: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వార్డు మెంబర్లు

సింగరాయకొండ: స్థానిక సర్పంచ్ తాటిపర్తి వనజపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని పంచాయతీ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ తాటిపర్తి వనజ అని పంచాయతీ వార్డు సభ్యులు, దళిత సంఘాల నాయకులు కొనియాడారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో, పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో సర్పంచ్ తాటిపర్తి వనజకు మద్దతుగా ఇరు వర్గాల వారు గురువారం వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ సర్పంచ్ వనజ పంచాయతీ నిధులు 35 లక్షల రూపాయలు అక్రమంగా డ్రా చేసిందని కావున ఆమె చెక్ పవర్ రద్దు చేయాలని కోరుతూ సోమవారం స్పందనలో కలెక్టరుకు జనసేన నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్పంచ్ తన సొంత నిధులతో ప్రతి సంవత్సరం వేసవిలో ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేసేవారని, కోవిడ్ సమయంలో ప్రతి ఇంటికి నిత్యావసర వస్తువులు అందజేశారని గుర్తు చేశారు. వార్డు మెంబరు గంజి సుబ్బారావు మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా సర్పంచ్ తన ఖాతాకు మళ్లించలేదని.. నగదు డ్రా చేయలేదన్నారు. వాస్తవానికి పంచాయతీ అకౌంట్‌కు జమఅయింది 35 లక్షలు కాదని 32 లక్షల రూపాయలు మాత్రమేనన్నారు. వివిధ ఖాతాలకు చెల్లింపులు చేసింది కేవలం 25 లక్షలు మాత్రమేనన్నారు. వీటిలో 5 లక్షల రూపాయలు కరెంటు బిల్లుకు చెల్లించగా మిగిలిన 20 లక్షల్లో సగానికి పైగా పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించక ముందు ప్రత్యేకాధికారుల పాలనలో ఖర్చు చేసిన బిల్లులకు సంబంధించి చేసిన చెల్లింపులని తెలిపారు. మిగిలిన మొత్తానికి సంబంధించి సుందర్‌నగర్‌లో మురుగుకాల్వల నిర్మాణం, పాత పోస్టాఫీసు సెంటర్, రాములమ్మకాలనీలో చేసిన అభివృద్ధి పనులు, శ్మశాన వాటికలో వేసిన కొత్త బోర్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద నిర్మించిన ప్రహరీ నిర్మాణం, జగనన్న లేఅవుట్ లెవలింగ్ పనులకు సంబంధించి ఎవరు పనులు చేశారో వారి వ్యక్తిగత ఖాతాలకు నగదు జమ చేశారే తప్ప సర్పంచ్ వ్యక్తిగత ఖాతాకు నగదు జమ చేసుకోలేదని వివరించారు. దళిత సర్పంచ్‌పై అసత్య ఆరోపణలు చేయడంతో పాటు ఈ అసత్యాలను సోషల్ మీడియా ద్వారా వైరల్ చేయడాన్ని ఖండించారు. వార్డు మెంబర్ షేక్ కరీం, సోమిశెట్టి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాపూరి ప్రభావతి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణుల అవసరాలు తీర్చే పనులు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కోట్ల, డ్వామా పీడీ శీనారెడ్డి

త్రిపురాంతకం: గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అవసరాలు, గ్రామీణ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన రోడ్లు, నీటి నిల్వలు పెంచేందుకు దోహదపడే పనులు, వ్యవసాయానికి అవసరమైన పంటకాల్వలు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ఎక్కువగా చేపట్టాలని ఎంపీపీ సూచించారు. డ్వామా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పనులు గుర్తించే సమయంలో అవసరమైన పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపాలన్నారు. పంట కాలువలకు అవకాశం ఉన్నందున గుర్తించి ముందుగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

ట్రాక్టర్, బస్సు ఢీ

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న కర్ర లోడుతో ఉన్న ట్రాక్టరును ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో కర్ర లోడు రోడ్డు పై పడి సుమారు గంట సేపు ట్రాఫిక్ జాం అయింది. ఈ సంఘటన గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో కందుకూరు వెళ్లే రహదారిలో కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల వద్ద జరిగింది. ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు. ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా జేసీబీ సహకారంతో కర్రలను రోడ్డు పక్కకి లాగించి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. ఏఎస్సై షేక్ మొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.